క్లుప్తంగా

మధ్యాహ్న భోజన కార్మికులకు కనీస వేతనమివ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న రమాదేవి

కర్నూలు(సెంట్రల్): పాఠశాలల్లో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన పథకం కార్మికులు, స్కావెంజర్లకు కనీస వేతనంగా రూ.26 వేలు ఇవ్వాలని ఏపీ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమాదేవి కోరారు. ఆదివారం కార్మిక, కర్షక భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. మధ్యాహ్న భోజనం పథకం కార్మికులు, స్కావెంజర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. మధ్యాహ్న భోజనానికి సంబంధించిన మెను రేట్లు పెంచాలన్నారు.

వృద్ధుల ఆశ్రమంలో నూతన వస్త్రాల పంపిణీ



వృద్ధులకు నూతన వస్త్రాలను అందిస్తున్న దేవపూజ దంపతులు

కర్నూలు(అర్బన్): నగరంలోని బి. క్యాంప్ అమ్మ వృద్ధుల ఆశ్రమంలో ఆదివారం వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం రాష్ట్ర కార్యదర్శి దేవపూజ ధనుంజయ ఆచారి, ఆయన సతీమణి లక్ష్మీదేవి వృద్ధులకు నూతన వస్త్రాలు, బియ్యం, పండ్లు, బిస్కెట్ ప్యాకెట్లు, స్టీల్ గ్లాసులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ కుమారుడు దేవపూజ దినేష్ 28వ జయంతిని పురస్కరించుకుని ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు.

దోమల నివారణకు చర్యలు



వన్‌టౌన్‌లో దోమల నివారణకు ఫాగింగ్ చేస్తున్న నగర పాలక సిబ్బంది

కర్నూలు (న్యూటౌన్): కర్నూలు నగరంలో గత కొన్ని రోజులుగా దోమల వృద్ధి నివారణకు కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ చర్యలు చేపట్టారు. ఐదు ఆధునిక ఫాగింగ్ మిషన్లు కొనుగోలు చేసి కర్నూలు నగరంలో విస్తృతంగా ఫాగింగ్‌కు చర్యలు చేపట్టారు. తుంగభద్ర, హంద్రీనది, కేసీ కెనాల్ పరివాహక కాలనీల్లో దోమల వ్యాప్తి ఎక్కువగా ఉండడంతో కర్నూలు నగర పాలక సంస్థ మలేరియా విభాగం సిబ్బంది ముమ్మరంగా ఫాగింగ్ చేపడుతున్నారు.

ఎస్‌డీ తేజేశ్వరరావుకు సన్మానం



సన్మానిస్తున్న దృశ్యం

కర్నూలు(సెంట్రల్): పోలీసు శాఖలో సీఐగా పనిచేస్తూ డీఎస్పీగా పదోన్నతి పొంది చిత్తూరుకు వెళ్తున్న ఎస్‌డీ తేజేశ్వరరావుకు బ్రాహ్మణ సేవా సంక్షేమ మిత్ర మండలి ఘన సన్మానం చేసింది. కొత్తపేటలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాలులో జరిగిన కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి నాగువలరాజశేఖర్, జిల్లా అధ్యక్షుడు ఆపన్న ప్రదీపన్న, దేవీ ఫంక్షన్ హాలు యజమాని కొలుకుల చంద్రశేఖర్ శాలువ కప్పి సత్కరించారు. కార్యక్రమంలో సంఘం నేతలు శ్రీనివాసరాజు, నొస్సం రామకృష్ణ, చల్ల నాగరాజుశర్మ, కరణం అనూజ్‌కుమార్, సందేల్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో కలశయాత్ర



కలశ యాత్ర ఊరేగింపులో భక్తులు

కర్నూలు కల్చరల్: వాసవీ దీక్షా సమితి ఆధ్వర్యంలో ఆదివారం భక్తి శ్రద్ధలతో కలశ యాత్ర నిర్వహించారు. ఉత్తరాయణం హేమంత రుతువు పుష్యమాసం బహళ నవమిని పురస్కరించుకొని ఓల్డ్‌సిటీలోని రాంబొట్ల దేవాలయం నుంచి చిన్న అమ్మ వారి శాల వరకు కలశ యాత్ర చేశారు. లలితా పీఠం పీఠాధిపతి మేడా సుబ్రహ్మణ్య స్వామి, టీడీపీ కర్నూ లు నియోజకవర్గ ఇన్‌చార్జ్ టీజీ భరత్, వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు గోరంట్ల రమణ, వాసవి దీక్షా సమి తి ప్రతినిధి శేషగిరి శెట్టి కలశ యాత్ర ప్రారంభించారు. అనంతరం చిన్న అమ్మవారి శాలలో వాసవి మాతకు అభిషేకం నిర్వహించారు. సోమవారం ఉదయం 10 గంటలకు కలశ స్థాపన, 12 గంటలకు పూర్ణాహుతి కార్యక్రమాలు జరుగుతాయని నిర్వాహకులు పేర్కొన్నారు. సమితి సభ్యులు, చిన్న అమ్మవారి శాల ఆలయ కమిటీ సభ్యులు, వివిధ ధార్మిక సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

జగనన్నతోనే బడుగుల వికాసం

ఎస్సీ కమ్యూనిటీ హాలు ప్రారంభోత్సవంలో మేయర్ బీవై రామయ్య, ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్



ఎస్సీ కమ్యూనిటీ హాలు ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మేయర్, ఎమ్మెల్యే



ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ సమక్షంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరిన టీడీపీ శ్రేణులు

కర్నూలు (టౌన్) : బడుగుల వికాసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని నగర మేయర్ బీవై రామయ్య, కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ స్పష్టం చేశారు. స్థానిక పాతబస్టాండ్ ఉర్దూఘర్ వద్ద రూ.70 లక్షలు వెచ్చించి నిర్మించిన ఎస్సీ కమ్యూనిటీ హాలును ఆదివారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మేయర్, ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా సామాజిక న్యాయం, సామాజిక సమీకరణాలు మన రాష్ట్రంలో జరుగుతున్నాయన్నారు. ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు అధికారంలో, రాజకీయ పదవుల్లో 60 శాతం కేటాయిస్తూ ఆత్మ గౌరవాన్ని పెంచారన్నారు. గత టీడీపీ సర్కారు బడుగు, బలహీనవర్గాలను ఓటు బ్యాంకుగా వాడుకుంటే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆ వర్గాలను రాజకీయంగా అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. మంత్రి పదవులు, ఎమ్మెల్యేలు, జిల్లా పరిషత్తు చైర్మన్లు, మున్సిపల్ చైర్మన్లు, మేయర్లు, డిప్యూటీ మేయర్లు ఇలా అనేక ఉన్నత స్థాయి పదవులు ఆయా వర్గాలకే కేటాయించిన ఘనత వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. ఐదేళ్ల పాలనలో ఇంటింటికీ సంక్షేమం అందించారన్నారు. చంద్రబాబు నాయుడు ఏనాడు ప్రజల సంక్షేమం పట్టించుకోలేదన్నారు. గతంలో ఎస్సీలకు ఇచ్చిన మాట ప్రకారం ఎస్సీ కమ్యూనిటీ హాలు నిర్మించి ప్రారంభిస్తున్నామని చెప్పారు. మొదటి అంతస్తు కట్టేందుకు కూడా చర్యలు తీసుకుంటామన్నారు. వైఎస్‌ఆర్‌సీపీ నగర అధ్యక్షురాలు సిట్రా సత్యనారయణమ్మ, సంయుక్త కార్యదర్శి రైల్వే ప్రసాద్, వైఎస్‌ఆర్ సేవాదళ్ అధ్యక్షుడు కేదార్‌నాథ్ మాట్లాడుతూ సామాజిక న్యాయం వైఎస్ జగన్ పాలనలో జరుగుతుందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు మరోసారి ఆయనను గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జ్ జిల్లా వక్ఫ్‌బోర్డు సభ్యులు ఫైరోజు, స్థానిక నాయకులు, మాజీ కార్పొరేటర్ మహేష్, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వైఎస్‌ఆర్‌సీపీలో చేరిక

నగర పరిధిలోని 2 వ వార్డులో టీడీపీకి చెందిన 60 కుటుంబాలు ఆదివారం కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ సమక్షంలో వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సుబేదార్ వీధి, అలీ షేర్ బేగ్ వీధులకు చెందిన జావీద్, మక్బుల్, మహమ్మద్, అయూబ్, అంజాద్, మహబూబ్, ఉమర్, అమ్మద్, సాధిక్, అజ్మత్, ఇక్బాల్, అబ్దుల్లా, షేక్, మాలిక్, ఫిరోజ్ తదితరులు పార్టీలో చేరిన వారిలో ఉన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్ని వర్గాలకు మేలు చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు అండగా నిలబడి గెలిపించుకుందామన్నారు. కర్నూలు నగరాన్ని స్మార్ట్‌సిటీ గా తీర్చిదిద్దేందుకు రూ. వందల కోట్లు ఖర్చు చేసినట్లు చెప్పారు. గత తెలుగు దేశం ప్రభుత్వం నగర అభివృద్ధిని పూర్తిగా విస్మరించిందన్నారు. కార్యక్రమంలో షబ్బీర్ ఖాన్, అనురాధ, సురేష్, హుస్సేన్, ఇక్బాల్, అర్షియా, ఖాదర్, రాము తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ స్టౌవ్‌లు, సిలిండర్లు పంపిణీ

2 వ వార్డులో 50 పేద కుటుంబాలకు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ గ్యాస్ స్టౌవ్‌లు, సిలిండర్లు పంపిణీ చేశారు. పేదల సంక్షేమానికి తమ ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తోందని ఈ సందర్భంగా ఆయన అన్నారు. కార్యక్రమంలో స్థానిక వార్డు ఇన్‌చార్జ్ ఫైరోజ్ పాల్గొన్నారు.

పార్వేట పల్లకీకి నీరాజనం

ఆళ్లగడ్డ: అహోబిలం లక్ష్మీనరసింహ స్వామి పార్వేట పల్లకీకి ఆళ్లగడ్డ ప్రజలు నీరాజనం పడుతున్నారు. శనివారం పట్టణంలోకి ప్రవేశించిన పల్లకీ ఆదివారం పలు తెలుపులపై కొలువు కావడంతో జ్వాలా నరసింహస్వామి, ప్రహ్లాదవరదస్వామిని భక్తులు దర్శించుకున్నారు. అనంతరం ఒక తెలుపు నుంచి మరో తెలుపుపైకి భక్తులు భుజాలపై మోసుకుంటూ చేర్చారు. స్వామి రాకతో పట్టణంలోని ఇళ్లు బంధుగణంతో కిటకిటలాడుతున్నాయి. డీసీసీబీ చైర్‌పర్సన్ ఎస్వీ విజయ మనోహరి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో విజయ డెయిరీ చైర్మన్ ఎస్వీ జగన్‌మోహన్‌రెడ్డి ఉన్నారు.

అ‘పూర్వ’ కలయిక

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని సోగనూరు రోడ్డు జెడ్పీ బాలుర హైస్కూల్‌లో 2001-2002 విద్యా సంవత్సరంలో చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆ బ్యాచ్ విద్యార్థులందరూ తిరిగి కలుసుకుని నాటి మధుర స్మృతులను, జ్ఞాపకాలను నెమరేసుకొంటూ ఆనందంగా గడిపారు. మిత్రుల యోగక్షేమాలను తెలుసుకుంటూ సంతోషంగా గడిపారు. నాటి ఉపాధ్యాయులు, రిటైర్డ్ ఎంఈఓ రాజరత్నం, జగదీష్, ఎన్‌సీసీ మాస్టర్ నాగన్న, లలిత కుమారి తదితరులను ఘనంగా సత్కరించి గురుభక్తిని చాటుకున్నారు.

స్నేహితుని కుటుంబానికి సాయం

కృష్ణగిరి: మండల పరిధిలోని కంబాలపాడు హైస్కూల్‌లో 2002-03 సంవత్సరంలో పదో తరగతి చదివిన గ్రామానికి చెందిన లాలప్ప (38) గుండెపోటుతో మరణించడంతో అతని స్నేహితులు స్పందించారు. చేయిచేయి కలిపి కొంత నగదు సమకూర్చారు. నాటి ఉపాధ్యాయులు సైతం తోడై ఆదివారం లాలప్ప అంత్యక్రియలకు హాజరై, నివాళులర్పించారు. బాధిత కుటుంబీకులకు ప్రగాఢ సంతాపం తెలుపుతూ రూ.30 వేల నగదు సాయం అందించారు.

ఎన్నికల హామీలన్నీ అమలు

- సిద్ధం పోస్టర్ ఆవిష్కరణలో కోడుమూరు నియోజకవర్గ సమ్వనయకర్త ఆదిమూలపు సతీష్



సిద్ధం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కోడుమూరు నియోజకవర్గ సమన్వయకర్త డా.ఆదిమూలపు సతీష్

కర్నూలు సిటీ: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నీ అమలు చేసి దేశానికే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదర్శంగా నిలిచారని కోడుమూరు నియోజకవర్గ సమన్వయకర్త డా.ఆదిమూలపు సతీష్ అన్నారు. ఆదివారం కర్నూలు నగరపాలక సంస్థ పరిధిలోని 38వ వార్డులో సిద్ధం పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో మరోసారి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని సీఎంగా చేసుకునేందుకు పార్టీ క్యాడర్ సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికెళ్లి వివరించాలన్నారు. పేదలకు జరుగుతున్న మేలును చూసి ప్రతిపక్ష పార్టీలు ఓర్వలేకపోతున్నాయన్నారు. ఎన్నిలకు ప్రతి కార్యకర్త, నాయకులు సిద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో 40వ వార్డు కార్పొరేటర్ విక్రమసింహా రెడ్డి, పార్టీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

అత్యధిక మరణాలకు కారణం క్యాన్సర్

కర్నూలు(హాస్పిటల్): దేశంలో అత్యధిక మరణాలకు కారణమవుతున్న వ్యాధుల్లో క్యాన్సర్ అగ్రస్థానంలో ఉందని మెడికల్ ఆంకాలజిస్టు డాక్టర్ రాఘవేందర్‌రెడ్డి చెప్పారు. వరల్డ్ క్యాన్సర్ డేను పురస్కరించుకుని ఆదివారం స్థానిక మెడికవర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో క్లోస్ ది కేర్ గ్యాప్ అనే థీమ్‌తో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రాఘవేందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా ఏటా కోటి మంది క్యాన్సర్‌తో మరణిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మన దేశంలో ప్రతి సంవత్సరం 11 లక్షల మందికి క్యాన్సర్ సోకుతోందని చెప్పారు. నోటి క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్, ఊపిరితిత్తుల క్యాన్సర్, కడుపు క్యాన్సర్ మొదటి వరుసలో ఉంటున్నాయని తెలిపారు. సరైన అవగాహన లేకపోవడం, నిరక్షరాస్యత, భయం, వివిధ రకాల అపోహల వల్లే క్యాన్సర్ నిర్ధారణ ఆలస్యమవుతోందని అన్నారు. కార్యక్రమంలో హాస్పిటల్ సెంటర్ హెడ్ పి. నీలారెడ్డి, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

వీఆర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో...

స్థానిక ప్రకాష్‌నగర్‌లోని వీఆర్ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ప్రపంచ క్యాన్సర్ అవగాహన దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి వచ్చిన వారికి క్యాన్సర్ నిర్ధారణకు ఉచితంగా స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్జికల్ ఆంకాలజిస్టు డాక్టర్ సి. వాసురెడ్డి మాట్లాడుతూ క్యాన్సర్‌ను ముందే గుర్తించి చికిత్స తీసుకుంటే ప్రాణాపాయం ఉండదన్నారు. కానీ చాలా మంది చివరి దశలో వస్తున్నారని, దీనివల్ల ప్రాణా పాయం రిస్క్ కాస్త ఎక్కువగా ఉంటుందని తెలిపారు.

ఒమెగా హాస్పిటల్ ఆధ్వర్యంలో...

నగరంలోని ఒమెగా హాస్పిటల్, క్యాన్సర్ సొసైటీ ఆఫ్ కర్నూలు, రవీంద్ర విద్యాసంస్థలు, పుల్లయ్య ఇంజినీరింగ్ కళాశాలల సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం స్థానిక సి.క్యాంపు నుంచి ఒమెగా హాస్పిటల్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని రవీంద్ర విద్యాసంస్థల అధినేత జి.పుల్లయ్య ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ చక్కటి జీవనశైలి, క్రమశిక్షణతో మన ఆరోగ్యాన్ని సంరక్షించుకోవచ్చన్నారు. డాక్టర్ ఆదిత్య, డాక్టర్ వై. వెంకటరామిరెడ్డి, డాక్టర్ బి. రవీంద్రబాబు, డాక్టర్ సుధీర్‌రెడ్డి, డాక్టర్ యు. ఉమామహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

ఆర్‌డీఓ హరిప్రసాదుకు వీడ్కోలు



ఆర్‌డీఓ దంపతులను సన్మానిస్తున్న డీఆర్వో కె.మధుసూదన్‌రావు, ఇతర రెవెన్యూ సిబ్బంది

కర్నూలు(సెంట్రల్): కర్నూలు ఆర్‌డీఓగా పనిచేసి బదిలీపై మదనపల్లెకు వెళ్తున్న సి.హరిప్రసాదుకు తోటి ఉద్యోగులు ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఆదివారం ఆర్‌డీఓ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో జరిగిన ఈ కార్యక్రమానికి డీఆర్వో కె.మధుసూదన్‌రావు, తహసీల్దార్లు, పలువురు రెవెన్యూ సిబ్బంది హాజరై ఆర్‌డీఓ దంపతులను సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ కరోన సమయంలో, భూ రీసర్వేలో, పేదలకు ఇళ్ల పట్టాల పంపిణీ, 22ఏ జాబితా నుంచి అసైన్డ్ భూముల తొలగింపులో ఆయన తీసుకున్న చొరవ, పోషించిన పాత్రను కొనియాడారు. కాగా హరిప్రసాదు స్థానంలో కర్నూలుకు నరసరావుపేట ఆర్‌డీఓగా పనిచేస్తున్న ఎం.శేషిరెడ్డిని బదిలీ చేశారు. ఆయన సోమవారం బాధ్యతలు స్వీకరించనున్నారు.

ధర్మకర్త మండలి నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

ఓర్వకల్లు: మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కాల్వబుగ్గ దేవస్థానంలో నూతన ధర్మకర్త మండలి సభ్యుల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆలయ ఈఓ డీఆర్‌కేవీ ప్రసాద్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం నియమించిన ధర్మకర్త మండలి గడువు కాలం ఈ నెల 23వ తేదీకి ముగుస్తున్న నేపథ్యంలో కొత్త పాలక వర్గ సభ్యులకు అవకాశం కల్పిస్తున్నట్లు దేవదాయ, ధర్మదా య శాఖ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారన్నారు. నిబంధనల మేరకు మొత్తం 9 మంది సభ్యులతో కూడిన పాలక మండలి సభ్యులు ఈ నెల 3వ తేదీ నుంచి 23వ తేదీలోగా పూర్తి చేసిన దరఖాస్తులను డీసీ కార్యాలయంలో సమర్పించాలన్నారు.

సాహితీ దిగ్గజం పింగళి సూరన



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ పోచా, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా తదితరులు

నంద్యాల(వ్యవసాయం): శ్రీకృష్ణదేవరాయల ఆస్థాన కవి పింగళి సూరన సాహితీ దిగ్గజమని, ఆయన నంద్యాల ప్రాంత వాసి కావడం జిల్లా అదృష్టమని నంద్యాల పార్లమెంట్ సభ్యుడు పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా అన్నారు. ఆదివారం నంది రైతు సమాఖ్య మాతృభాష పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో రామకృష్ణ డిగ్రీ కళాశాల వివేకానంద ఆడిటోరియంలో అష్టదిగ్గజ కవి పింగళిసూరన పుస్తకావిష్కరణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ సాహిత్య పరంగా రాయలసీమకు ఘనమైన చరిత్ర ఉందని, వేమన, అన్నమయ్య పోతులూరి వీరబ్రహ్మం వంటి కవుల రచనలు తెలుగు సాహిత్యానికి వెలుగులు ప్రసాదించాయన్నారు. పుస్తకాల సంకలనకర్త జీఎస్ ఆర్‌కే శర్మ మాట్లాడుతూ పింగళి సూరన సాహితీ వైభవం సంకలన రూపంలో తేవడం తన అదృష్టమన్నారు. పుస్తక ప్రచురణ కర్త విశ్రాంత శాస్త్రవేత్త డాక్టర్ రవీంద్రనాథ్, ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డికి పుస్తకాన్ని అంకితం చేశారు. అనంతరం ఎంపీని సాహితీవేత్తలు, కవులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ దేశం సులోచన, మాజీ మున్సిపల్ చైర్మన్ కైప రాముడు, మైనార్టీ సంక్షేమ శాఖ ప్రభుత్వ సలహాదారు హబీబుల్లా, ఆర్‌వీ సుబ్బారెడ్డి, ఉదయ శంకర్, పార్వతీదేవి, పాల్గొన్నారు.

అవీ-ఇవీ

కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి అన్యాయం

కర్నూలు(సెంట్రల్): ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు తీవ్ర అన్యాయం జరిగిందని, వెనుకబడిన కర్నూలు జిల్లాకు ప్రత్యేక కేటాయింపులేమి లేవని ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.జగన్నాథం అన్నారు. ఆదివారం ఏఐకేఎస్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కేంద్ర బడ్జెట్‌లో రైతులను ఆదుకోవడానికి ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప, నగర కార్యదర్శి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

గ్రానైట్ స్లాబ్స్ లారీ సీజ్

కర్నూలు (న్యూటౌన్): ప్రకాశం జిల్లా బూదగోడ నుంచి గోవాకు గెలాక్సీ గ్రానైట్ స్లాబ్స్‌ను రాయల్టీ రవాణా పత్రాల్లో అనుమతించిన పరిమాణం కంటే అత్యధికంగా తరలిస్తున్న లారీని సీజ్ చేసినట్లు జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ టి రాజశేఖర్ తెలిపారు. గ్రానైట్ స్లాబ్స్‌ను అనుమతులకు మించి లారీలో తరలిస్తున్నారనే సమాచారంతో ఆదివారం తెల్లవారు జామున ఓర్వకల్లు మండలం నన్నూరు టోల్ ప్లాజా వద్ద ఆకస్మికంగా దాడి చేశారు. లారీని సీజ్ చేసి రూ.1,01,100 అపరాధ రుసుం విధించి వసూలు చేశారు. తనిఖీల్లో జిల్లా మైనింగ్ విజిలెన్స్ ఏడీ బైరాగినాయుడు, రాయల్టీ ఇన్‌స్పెక్టర్ మురహరి, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళ టీచర్ మృతి



ఎస్.విజయశ్రీ (ఫైల్)

కర్నూలు సిటీ: ఓర్వకల్లు మండలం నన్నూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఇంగ్లిషు స్కూల్ అసిస్టెంట్ టీచర్ ఎస్.విజయశ్రీ హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారు. 1996 డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ ఉద్యోగం పొందిన ఆమె విధులు నిర్వహించిన ప్రతి స్కూల్‌లో విద్యార్థుల మన్నలు పొందారు. మహిళ టీచర్ మృతిపై ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జ.హృదయరాజు, జిల్లా గౌరవ అధ్యక్షుడు కమలాకరరావు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.ఇస్మాయిల్, మరియానందం తదితరులు ఓ ప్రకటనలో సంతాపం తెలిపారు.

8న కాల్వబుగ్గ హుండీ ఆదాయం లెక్కింపు

ఓర్వకల్లు : మండలంలోని కాల్వబుగ్గ వెలసిన శ్రీబుగ్గరామేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 8వ తేదీన హుండీ ఆదాయం లెక్కింపు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఈఓ డీఆర్‌కేవీ ప్రసాద్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది జూన్ మాసం నుంచి స్వాముల వారికి భక్తులు సమర్పించిన కానుకలను, హుండీలోని నగదు ఉదయం 10.30 గంటలకు ఆలయ ధర్మకర్త మండలి సమక్షంలో లెక్కింపు కార్యక్రమం జరుగుతుందన్నారు. కార్యక్రమానికి బాలాజీ సేవా ట్రస్టు వారు కూడా హాజరుకానున్నట్లు తెలిపారు. ఆసక్తి గల భక్తులు కార్యక్రమానికి హాజరు కావాల్సిందిగా కోరారు.

ఆహారంలో మార్పులతో గుండె పదిలం



కార్యక్రమంలో మాట్లాడుతున్న పూర్వ జిల్లా కలెక్టర్ రామశంకర్‌నాయక్

కర్నూలు(హాస్పిటల్): ఆహారంలో కొద్దిగా మార్పులు చేసుకుంటే గుండె పదిలంగా ఉంటుందని పూర్వ జిల్లా కలెక్టర్ రామశంకర్‌నాయక్ చెప్పారు. కర్నూలు హార్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం స్థానిక ఎ.క్యాంపులోని కర్నూలు హెల్త్ క్లబ్‌లో గుండెజబ్బులపై ఆరోగ్య అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన రామశంకర్‌నాయక్ మాట్లాడుతూ తాను జిల్లా కలెక్టర్‌గా ఉన్న సమయంలో పది మందికి ఉపయోగపడుతుందని కర్నూలు హార్ట్ ఫౌండేషన్‌కు ఎ.క్యాంపులో క్వార్టర్ల స్థలం మంజూరు చేశానన్నారు. అందులో హెల్త్ క్లబ్ ఏర్పాటు చేసి ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ ఉండటం అభినందనీయమన్నారు. వ్యాధులు వచ్చిన తర్వాత చికిత్స తీసుకోవడం కన్నా రాకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవడం మేలని చెప్పారు. ఈ మేరకు జీవనశైలితో పాటు ఆహారంలో మార్పులు చేసుకోవాలన్నారు. ప్రతిరోజూ వ్యాయామం తప్పనిసరిగా చేయాలని సూచించారు. బయటి ఆహారానికి సాధ్యమైనంత దూరంగా ఉండాలని, వీలైతే స్వయంగా వండుకుని తినాలని చెప్పారు. వంటింట్లోని ఆహార దినుసుల్లో చాలా ఆరోగ్యాన్నిచ్చే పదార్థాలు ఉన్నాయని, వాటిని ఉపయోగించుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు. అనంతరం ఫౌండేషన్ కార్యదర్శి, సీనియర్ కార్డియాలజిస్టు డాక్టర్ పి. చంద్రశేఖర్ మాట్లాడుతూ గుండెపోటుకు సంబంధించి ఆరోగ్య అవగాహన కల్పించారు. రామశంకర్‌నాయక్‌ను హార్ట్ ఫౌండేషన్ కోశాధికారి కేపీ రాముడు, సభ్యులు లక్ష్మన్న, ఎలమర్తి రమణయ్య, ఎల్లయ్య తదితరులు ఘనంగా సన్మానించారు.

హరినామ సంకీర్తనతో ప్రశాంతత



శ్రీకృష్ణ చరిత్రను వివరిస్తున్న రామకృష్ణ ప్రభు

కర్నూలు కల్చరల్: హరినామ సంకీర్తన జపంతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ఇస్కాన్ బాధ్యుడు రామకృష్ణ ప్రభు అన్నారు. ఇస్కాన్ ఆధ్వర్యంలో స్థానిక భగీరథ కాంప్లెక్స్‌లోని జగన్నాథ మందిరంలో ఆదివారం భగవద్గీత శిక్షణ తరగతులు, శీల ప్రభుపాద ప్రేమ విందు కార్యక్రమాలు జరిగాయి. రామకృష్ణ ప్రభు మాట్లాడుతూ నిత్యం భగవద్గీతను పఠనం, శ్రవణం చేయాలన్నారు.దీని వల్ల ఎన్నో క్లిష్ట సమస్యలకు పరిష్కారం దొరుకుతుందన్నారు. అనంతరం హరే రామ హరే కృష్ణ మంత్రాన్ని జపం చేయించారు. ఇస్కాన్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

దూదేకులకు రాజకీయ ప్రాధాన్యత కల్పించాలి



అంబేడ్కర్ విగ్రహం ముందు మౌన దీక్ష చేస్తున్న దూదేకుల సంఘాల నాయకులు

కర్నూలు (అర్బన్): రానున్న ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు దూదేకులకు రాజకీయ ప్రాధాన్యత కల్పించాలని ఆంధ్రప్రదేశ్ నూర్‌బాషా / దూదేకుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పీర్ మహమ్మద్ కోరారు. ఆదివారం జిల్లా పరిషత్ ప్రాంగణంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దూదేకులకు రాష్ట్ర వ్యాప్తంగా 5 ఎమ్మెల్యే, 2 ఎంపీ స్థానాలు కేటాయించాలన్నారు. దూదేకులకు రాజకీయ ప్రాధాన్యత కల్పించే పార్టీలకే తాము మద్దతిస్తామన్నారు. అనంతరం అక్కడి నుంచి దూదేకుల సంఘం నాయకులు పాతబస్టాండు అంబేడ్కర్ విగ్రహం వరకూ ర్యాలీ నిర్వహించి విగ్రహం ముందు ప్లకార్డులు పట్టుకుని మౌన నిరసన దీక్ష చేపట్టారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు, రిటైర్డ్ డీఎస్పీ మహబూబ్‌బాషా, కార్యదర్శి సిద్ధయ్య తదితరులు పాల్గొన్నారు.

‘సత్యసాయి’ సేవలను విస్తృతం చేయాలి



మాట్లాడుతున్న ట్రస్ట్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సురేంద్ర

కర్నూలు కల్చరల్: సత్యసాయి సేవా ట్రస్ట్ సేవలను మరింత విస్తృతం చేయాలని ట్రస్ట్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సురేంద్ర పేర్కొన్నారు. ఆదివారం నెహ్రూనగర్‌లోని సత్యసాయి మందిరంలో జిల్లా స్థాయి సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ జిల్లాలో సత్యసాయి సంస్థను మరింత బలోపేతం చేయాలన్నారు. సేవా కేంద్రాలను పెంచాల్సిన అవసరం ఉందన్నారు. శతాబ్ది ఉత్సవాలు సమీపిస్తున్న తరుణంలో ట్రస్ట్ కార్యక్రమాలు పెంచాలన్నారు. ఆధ్యాత్మిక, సామాజిక సేవలతో భక్తులకు చేరువ కావాలన్నారు. సమావేశంలో సేవా విభాగం రాష్ట్ర అధ్యక్షుడు శ్యామ్, ట్రస్ట్ జిల్లా అధ్యక్షుడు మాకా అశోక్ కుమార్, సభ్యులు సాయిబాబా, సరోజ, సూర్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

రగ్బీ పోటీల్లో కర్నూలు జట్లు గెలుపు

- అసిస్టెంట్ పోలీస్ కమిషనర్ ఎం.జాన్ మనోహర్





రగ్బీ పోటీల్లో గెలుపొందిన కర్నూలు బాలురు, బాలికల జట్లకు కప్‌లు అందిస్తున్న ఏసీపీ జాన్ మనోహర్

భీమునిపట్నం (విశాఖ జిల్లా): రాష్ట్రస్థాయి రగ్బీ సబ్ జూనియర్ పోటీల్లో బాలురు, బాలికల విభాగంలో కర్నూలు జట్లు విజయం సాధించాయి. భీమిలి వుడా మైదానంలో మూడు రోజుల పాటు జిల్లా రగ్బీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ పోటీలు జరిగాయి. 13 జిల్లాల నుంచి 26 జట్లు పాల్గొన్నాయి. ఆదివారం జరిగిన ఫైనల్ పోరులో బాలుర విభాగంలో కర్నూలు, నెల్లూరు జట్లు తలపడగా కర్నూల్ జట్టు గెలుపొందింది. నెల్లూరు జట్టు రన్నర్‌గా నిలవగా, ప్రకాశం జట్టు మూడో స్థానంలో నిలిచింది. అలాగే బాలికల విభాగంలో కర్నూల్, ప్రకాశం జట్లు తలపడగా అందులో కర్నూల్ జట్టు గెలుపొందగా, ప్రకాశం జట్టు రన్నర్‌గా, అనంతపూర్ జట్టు మూడో స్థానంలో నిలిచింది. ముగింపు కార్యక్రమానికి అసిస్టెంట్ పోలీస్ కమిషనర్ ఎం.జాన్ మనోహర్ ముఖ్య అతిథిగా హాజరై గెలుపొందిన జట్లకు కప్‌లు, మెడల్స్ అందించారు.